పర్యాటక అభివృద్ధికి సహకరించాలి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి - మొగల్తూరు

తీరంలో పర్యాటక అభివృద్ధికి రైతులు, గ్రామస్తులు సహకరించాలని ఆర్‌డిఒ దాసి రాజు సూచించారు. మండలంలోని కెపిపాలెం సౌత్‌లో శుక్రవారం తహశీల్దార్ కె.రాజకిషోర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక అభివృద్ధిపై ఆర్‌డిఒ మాట్లాడారు. పర్యాటక అభివృద్ధిలో రైతులను కూడా ప్రభుత్వం భాగస్వామ్యం చేస్తుందన్నారు. దీనికి అంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి అందే దొరబాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ రాజు

సమానత్వం కోసం పోరాడాలి

సమాజంలో రాజ్యమేలుతున్న అసమానతలు

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కె.రమాదేవి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన విద్యార్థినుల రాష్ట్రస్థాయి కన్వెన్షన్ ఘనంగా ప్రారంభం

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో స్త్రీ, పురుష బేధాలు నేటికీ కొనసాగుతుండటం అత్యంత బాధాకరమని, ఈ నేపథ్యంలో సమానత్వం కోసం పోరాడాల్సిన అవసరం ఎంతో ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. సమాజంలో అసమానతలు రాజ్యమేలుతున్నాయని, రాజ్యాంగంలోని సమాన హక్కుల సాధనకు అంతా నడుం బిగించాలని కోరారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు రాష్ట్రస్థాయి విద్యార్థినుల కన్వెన్షన్ శుక్రవారం ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కన్వెన్షన్ ప్రారంభ సూచికగా ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లవి ఆవిష్కరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేగువేరా, సీతారాం ఏచూరి, భగత్ సింగ్, మల్లు స్వరాజ్యం, సావిత్రిభాయి పూలే, అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, షేక్ సాబ్జీ చిత్రపటాలకు నేతలు విద్యార్థినులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనర్ పావని అధ్యక్షతన జరిగిన కన్వెన్షన్‌లో జ్యోతి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మృతులకు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రమాదేవి ప్రారంభోపన్యాసం చేశారు. సమాజంలో కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ, పేద, ధనిక బేధాలు కొనసాగుతున్నాయన్నారు. నేటికీ మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. శారదా పీఠం నిర్వహిస్తూ, ఐఐటి కళాశాల డైరెక్టర్‌గా పని చేస్తున్న స్వామి చైతన్యానంద మహిళ ఆధ్యాపకులను, విద్యార్థినులను వేధించడం, ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన రెజ్లర్స్ పట్ల బిజెపి ఎంపీ అసభ్యకరంగా ప్రవర్తించడం వంటివి అనేకం జరుగుతున్నాయన్నారు. ధర్మస్థలం అనే ప్రాంతంలో 400 మంది మహిళలు, విద్యార్థినులు ఏమయ్యారో తెలియదని, పేరుకే అది ధర్మస్థలమని, అయితే అది అధర్మ స్థలమని విమర్శించారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించట్లేదని విమర్శించారు. ఎస్‌సి హాస్టళ్లలో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. యూనివర్సిటీల్లో సైతం పరిస్థితి మరింత ఘోరంగా ఉందన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందట్లేదని, కనీస సౌకర్యాలూ ఉండట్లేదని తెలిపారు. 8 గంటల పని విధానాన్ని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో చట్టం చేశారని, ఇక మహిళలు ఏవిధంగా బతుకుతారో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పాలని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతలు మహిళలను కించపరిచే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. 32 మంది బలిదానంతో ఏర్పాటు చేసుకున్న నాలుగు లక్షల కోట్లు విలువైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కారుచౌకగా అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నం చేస్తుంటే మాజీ ముఖ్యమంత్రి జగన్ వాళ్లతో జత కలవడం దారుణమన్నారు. చదువు ఎంత ముఖ్యమో, ఉద్యోగం, ఉపాధి కూడా అంతే ముఖ్యమని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమాజంలో గౌరవం పొందాలంటే పోరాడి సమాన హక్కులను సాధించుకోవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కేరళలోని త్రివేండ్రంలో 1979లో ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భవించిందని, ఇప్పటికి 55 ఏళ్ల పూర్తవుతుందని అన్నారు. అసమానతలకు వ్యతిరేకంగా సమానత్వం కోసం నాటి నుంచి పోరాడుతూనే ఉందన్నారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులపై నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు. పసి పిల్లల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకూ అందరిపై దాడులు, అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళా రెజ్లర్ల పట్ల బిజెపి ఎంపీ అసభ్యకరంగా ప్రవర్తిస్తే సుప్రీంకోర్టు ఆదేశాలతో కేసు నమోదు చేసినప్పటికీ శిక్ష విధించలేదని విమర్శించారు. గుజరాత్‌లో మారణ హోమం కారకులను జైలు నుంచి విడిపించి, వారిని సత్కరించడం దారుణమన్నారు. అసమానతలు పెంచి పోషిస్తుంది పాలకపక్షాలేనని ఆరోపించారు. సమానత్వం కోసం పోరాడడమే కాకుండా వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి విద్యార్థులకు తీరని ద్రోహం చేసిందన్నారు. దీనిలో ముఖ్యంగా నష్టపోయింది విద్యార్థినులేనన్నారు. చరిత్ర పాఠ్యాంశాలను తొలగించి మతోన్మాదంతో కూడిన మనుధర్మాన్ని పాఠ్య పుస్తకాల్లోకి తీసుకురావడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కో కన్వీనర్ లలిత, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన విద్యార్థినులు

సమానత్వంతో కూడిన విద్య అందించాలి

ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్

మాట్లాడుతున్న ఐషీ ఘోష్

ప్రభుత్వం అందరికీ సమానత్వంతో కూడిన విద్య అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర విద్యార్థినులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. విద్యా సంస్థల ప్రయివేటీకరణ వల్ల వల్ల విద్య అందని ద్రాక్షలా మారిందన్నారు. నూతన విద్యా విధానం ఫలితంగా లక్షలాది మంది విద్యార్థినులు విద్య కు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు, వివక్ష, అత్యాచారాలకు వ్యతిరేకంగా విద్యార్థినులు పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ సిహెచ్.పావని మాట్లాడుతూ రాష్ట్రంలో అనేకమంది విద్యార్థినులపై హత్యలు, లైంగిక దాడులు, వేధింపులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తాను పెట్టబోయే మొదటి సంతకం సుగాలి ప్రీతి కేసుపై అని బహిరంగ సభలో చెప్పారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా సుగాలి ప్రీతి కేసు పట్టించుకోలేదని విమర్శించారు. ఆలిండియా కమిటీ సభ్యురాలు పల్లవి, నేతలు పి.పవిత్ర, జ్యోతి, అమూల్య, నవిత, వివిధ జిల్లాల నుంచి విద్యార్థినుల కమిటీ నేతలు పాల్గొన్నారు.

మహిళల కోసమే ప్రత్యేక వైద్య శిబిరాలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - ఉండి

మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందనే ఉద్దేశంతో మహిళల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం ఉండిలోని పిహెచ్‌సిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'స్వస్థనారీ స్వశక్త పరివార్ అభియాన్' వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. తొలుత పిహెచ్‌సిలోని అన్ని వార్డులను పరిశీలించి అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆభా ఐడి రిజిస్ట్రేషన్ ఎంతవరకు పూర్తి చేశారు, ఇంకా ఎన్ని చేయాలి, ఈ నెలలో ఎన్ని ప్రసవాలు చేశారు, ల్యాబ్ టెస్టులు ఎన్ని పూర్తి చేశారు, కౌమార దశ బాలికలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా, ఎనిమియా ముక్తభారత్‌లో భాగంగా పరీక్షలు చేసి రక్తహీనత ఉన్నవారికి టాబ్లెట్లు అందిస్తున్నారా, వృద్ధులకు టీబీ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీలతో మాట్లాడుతూ బాలామృతం సక్రమంగా అందిస్తున్నారా, గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడానికి అవగాహన కల్పిస్తున్నారా అని ప్రశ్నించారు. మెడికల్ క్యాంపులో ఎంతమంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అడిగి తెలుసుకున్నారు. స్త్రీలకు, బాలికలకు అందరికీ తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఇంకా క్యాంపునకు రాని వారికి అవగాహన కల్పించి క్యాంపునకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ జి.గీతాబాయి క్యాంపు వివరాలను వెల్లడించారు. కలెక్టర్ వైద్య శిబిరాన్ని మండలంలో పరిశీలించి, వైద్య పరీక్షలకు వచ్చిన వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్యం బాగోకపోతే కుటుంబమంతా ఇబ్బంది పడుతుందని, మహిళలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.బెన్నీశామ్యూల్, డాక్టర్ ఐసి కీర్తన, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.దివ్యశ్రీ, ఆప్తాల్ టెక్నీషియన్ జగదీష్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ

చిన్నారిపై అఘాయిత్యాన్ని ఖండిస్తూ ఐద్వా నిరసన

మొగల్తూరు : నిరసన ప్రదర్శనలో నాయకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

స్థానికంగా చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన కోనాల జాన్‌బాబుపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. మహిళలపై అఘాయిత్యాలకు నిరసనగా మొగల్తూరులో శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడారు. ఇటీవల కాలంలో మహిళలపై అఘాయిత్యాలు పెరగడం బాధాకరమన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు పటిష్టంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాలిక కుటుంబానికి సంఘీభావంగా పార్టీలకు అతీతంగా ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, కనుమూరి ఆంజనేయులురాజు, రేవు నారాయణరాజు, తన్నేడి గిరి, లింగం ఏసుబాబు, పడవల సత్యనారాయణ, కొండ ఆదాము, డొల్ల రత్నరాజు, బత్తుల వెంకట్రావు, యడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు, వడుగు శ్రీనివాస్, వీరా పాండురంగారావు, మహిళలు మోకా విజయ, కొండ చిట్టి, నక్క కౌసల్య, ఇంజేటి సువార్త, కొండ ఉమ, కె.ఉష తదితరులు పాల్గొన్నారు.

బాధిత బాలికకు పరామర్శ

నరసాపురం: మొగల్తూరు మండలంలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.పూర్ణ డిమాండ్ చేశారు. నరసాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారిని ఐద్వా బృందం శుక్రవారం పరామర్శించింది. చిన్నారికి, ఆమె తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి ఐద్వా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన కోనాల జాన్‌బాబును కఠినంగా శిక్షించాలని పూర్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు ఎస్.జయప్రభ, బి.సరోజ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అమెరికా సుంకాలతో ఆక్వారంగం కుదేలు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అన్యాయం

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ విరమించుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

యనమదుర్రు వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

అమెరికా సుంకాలతో విలవిల్లాడుతున్న ఆక్వా రైతులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అమెరికా సుంకాల వల్ల ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా మాటలు మాని వారిని ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. విశాఖ ఉక్కును కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, వాటిని తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలను ప్రయివేటుపరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమన్నారు. పిపిపి అంటే ప్రయివేటీకరణ కాదని, దానివల్ల అదనపు సౌకర్యాలు వస్తాయని లోకేష్ చెప్పడం ప్రజలను పక్కదారి పట్టించడమేనని విమర్శించారు. స్మార్ట్‌మీటర్ల బిగింపు వల్ల విద్యుత్ ఛార్జీలు పెరుగుతాయని జనం ఆందోళన చెందుతున్నా ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లడం బాధాకరమన్నారు. గుర్తింపుకార్డులు, రుణాలు ఇవ్వకపోవడం వల్ల కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లు నిర్మించాలన్నారు. టిడ్కో ఇళ్ల ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

9, 10 తేదీల్లో పెన్షన్, జిపిఎఫ్ అదాలత్

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంలో అక్టోబర్ 9, 10 తేదీల్లో రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ వారిచే 'పెన్షన్, జిపిఎఫ్ అదాలత్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా ఖజానా, ఖాతాల అధికారి ఆడారి గణేష్ ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయాలు నుండి ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ, రాష్ట్ర ఖజానా, లెక్కల అధికారి డాక్టర్ నేతల మోహన్‌రావు, అకౌంటెంట్ జనరల్, ఖజానా శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా జిల్లాలోని వివిధ శాఖల డిడిఒల వద్ద అపరిష్కృతంగా ఉన్న పెన్షన్, జిపిఎఫ్, రికన్సిలేషన్, మిస్సింగ్ క్రెడిట్స్, డెబిట్స్, ఎజి పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. పెన్షనర్లు, జిపిఎఫ్ చందాదారులకు సమర్థవంతమైన సేవలు సకాలంలో అందేలా చూడటం కోసం జిల్లాలోని అన్ని శాఖల ప్రధాన అధికారులకు (డిడిఒ)లకు తగు సూచనలను ఇస్తారన్నారు. దీన్ని వినియోగించుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

10వ తేదీలోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గరిష్ట ప్రయోజనం పొందేలా అవగాహన కల్పించడమే ధాన్యం కొనుగోలు అవగాహన సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామం కమ్యూనిటీ హాల్‌లో ఖరీఫ్ 2025-26 సీజన్ ధాన్యం కొనుగోలు సంబంధించి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో జెసి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. మండలంలో అక్టోబరు 10వ తేదీ లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రైతులు దళారులు, మధ్యవర్తుల చేతిలో నష్టపోకుండా, ఎటువంటి మోసాలకు తావులేకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా మాత్రమే ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు ధాన్యం తేమశాతంలో ఎదురవుతున్న సమస్యలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తేమశాతం బరువు, నాణ్యత వంటి అంశంపై రైతు సేవా కేంద్రాల వద్ద నిర్ధారించిన తేమ శాతం మాత్రమే పరిగణలోకి తీసుకోబడుతుందని, దీనిపై ఎటువంటి సమస్యలు ఉన్నా మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం సరఫరా చేసే గోనె సంచుల నాణ్యతను ముందుగా చూసుకొని రైతులు తీసుకు వెళ్లాలన్నారు. ఎఫ్ఎ క్యూ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని సిద్ధపరిచి ప్రభుత్వం ద్వారా మద్దతు ధరకు అమ్ముకోవాలని జెసి రైతులకు సూచించారు. అనంతరం ధాన్యం కొనుగోలు సమాచారాన్ని తెలియజేసే కరపత్రాన్ని సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్ భానో, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎం.సునీల్ కుమార్, మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావు, గ్రామ సర్పంచి సూర్యకుమారి, కృషి అమృత భారత్ ఛైర్మన్ నరేష్, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయితీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

దళితుల శ్మశాన వాటికలో డంపింగ్ యార్డ్

మృతదేహాన్ని పూడ్చిపెట్టడానికి వీలులేకుండా చెత్త నిల్వ

ఏళ్లు గడుస్తున్నా.. తలరాతలు మారడం లేదు : దళితుల ఆవేదన

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడి శ్మశాన వాటికలో మృతదేహాన్ని పూడ్చి పెట్టడానికి వీలు లేకుండా డంపింగ్ యార్డ్ ఉండడం పట్ల స్థానికుల తరుపున జాలెం చిన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ నెగ్గిపూడి గ్రామపంచాయతీ పరిధిలో గల దళితుల శ్మశాన వాటిక ప్రాంతంలో కొండలను తలపించే విధంగా చెత్త తో నిండిన డంపింగ్ యార్డ్ దుర్గంధంతో ఇబ్బంది పెడుతోందని వాపోయారు. గ్రామంలోని దళితపేటలో ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలు చేయడానికి వీలు లేకుండా దళితులకు కేటాయించిన స్థలమంతటినీ డంపింగ్ యార్డ్ నిల్వచేయడంపై ఆయన ఆందోళన చెందారు. ఎన్నో ఏళ్లు గడుస్తున్నా.. తమ తలరాతలు మారడం లేదని, చనిపోయిన వారి మృతదేహాన్ని పూడ్చి పెట్టడానికి వీలు లేకుండా, కొండలను తలపించే విధంగా శ్మశాన వాటికలో చెత్తను నిలవ ఉంచడం బాధాకరమని అన్నారు. ఈమేరకు నెగ్గిపూడి గ్రామపంచాయతీ కార్యదర్శికి స్థానిక గ్రామ నివాసి జాలెం చిన్న ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించినట్టు తెలిపారు.

నెగ్గిపూడి శ్మశానం వద్ద డంపింగ్ యార్డ్

'ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి'

నరసాపురం : ఆర్‌టిసిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీసవేతనం, పండుగ సెలవులు అమలు చేయాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.తులసీరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మీరా భవనంలో ఆర్‌టిసిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆర్‌టిసిలో అనేక ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు జీతంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెకానిక్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం వల్ల అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కాంట్రాక్టర్స్ కనీస వేతనాలు ఇవ్వకుండా వేధిపులకు గురిచేయడం తగదన్నారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షులు నలబాల శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపోలో అనేక విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

మమ్మల్ని వెలి వేశారు..

పెన్నాడ గ్రామానికి చెందిన 28 మంది ఆవేదన

పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా

భీమవరం రూరల్ సిఐ, రెవెన్యూ అధికారుల విచారణ

ప్రజాశక్తి - పాలకోడేరు

తమ కులానికి చెందిన పెద్దలు తమను వెలి వేశారంటూ పెన్నాడ గ్రామానికి చెందిన కొంతమంది పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సుమారు 28 మందిని కులం నుంచి వెలి వేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శెట్టిబలిజ పెద్దలు దొమ్మేటి వేణుగోపాలం, పంపన వెంకటేశ్వరరావు, పాల శేషు, గుత్తుల కొండలరావు, జక్కంశెట్టి బాలమురళీకృష్ణ, చింతపల్లి రామకృష్ణ తమ మాట వినడం లేదంటూ మూడేళ్ల క్రితం కొంత మందిని, ఏడాది క్రితం మరి కొంతమందిని, ఏడు నెలల క్రితం కొంతమందిని మొత్తం 28 మందిని కులం నుంచి వెలి వేశారు. ప్రేమ పెళ్లి విషయంలోనూ, స్థలం అమ్మకం విషయంలోనూ, డ్రెయినేజీ నిర్మాణ విషయంలోనూ ఇలా మమ్మల్ని బహిష్కరించినట్లు దొంగ నాగలక్ష్మి, దొమ్మేటి వెంకటేశ్వరరావు, పి.సురేష్, గుత్తుల నాగరాజు, జక్కంశెట్టి సత్య నాగరాజు, సిహెచ్.సుబ్రహ్మణ్యం, చింతపల్లి శివప్రసాద్, గుత్తుల శ్రీనివాస్, చీరబోయిన శ్రీనివాసరావు, బొక్కా రమేష్, పంపన రవి మొత్తం 28 మందిని బహిష్కరించినట్లు తెలిపారు. అప్పటి నుంచి శుభకార్యాలకు పిలవడం లేదని, అంతేగాక ఇళ్లకు వచ్చిన చుట్టాలను కూడా అవమానిస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ వద్ద ఆందోళన చేస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్న భీమవరం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్, పాలకోడేరు ఎస్ఐ రవివర్మ, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాఘవ రాజు, విఆర్ఒ సుబ్రహ్మణ్యం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బాధితులను విచారించారు. అయితే అవతలి వారు అందుబాటులో లేకపోవడంతో విచారణ రేపటికి వాయిదా వేశారు.

వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

రూ.118 కోట్ల మంజూరు అభినందనీయం

అసెంబ్లీలో ప్రస్తావించిన తణుకు ఎంఎల్ఎ రాధాకృష్ణ

తణుకు : అమృత్-2 పథకంలో భాగంగా తణుకు పట్టణానికి గోదావరి నీరు తరలించే గ్రిడ్ మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.118 కోట్లు మంజూరు చేయడం అభినందనీయమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో శుక్రవారం ఎంఎల్ఎ రాధాకృష్ణ సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. తణుకు పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి ఇంటికి గోదావరి నీరు అందించేందుకు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 118 కోట్లు కేటాయించడం హర్షణీయమని అన్నారు. 2027 నాటికి పనులు పూర్తి చేస్తామని వెల్లడించిన రాష్ట్ర మంత్రి నారాయణ ఇచ్చిన సమాధానానికి ఎంఎల్ఎ మాట్లాడుతూ.. ఏ ప్రాతిపదికన 2027 నాటికి పనులు పూర్తి చేస్తారని ప్రశ్నించారు. మొత్తం ప్రాజెక్టును ఒకే ఏజెన్సీకు కాంట్రాక్టర్‌కు ఇస్తున్నారా లేక తణుకు పట్టణానికి చెందిన ప్రాజెక్టుని ఒక కాంట్రాక్టర్‌కు ఇస్తున్నారా స్పష్టం చేయాలన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో మున్సిపాలిటీ భాగస్వామ్యం ఉంటుందా నిధులు ఏమైనా చెల్లించాల్సిన పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులో కొత్తగా ఎన్ని ట్యాప్ కనెక్షన్లు ఇవ్వబోతున్నాం.. ఎన్ని కిలోమీటర్లు మేర పైపు లైన్లు నిర్మించబోతున్నామనేది తెలియజేయాలని కోరారు. టెండర్ల ప్రక్రియ ఎంతవరకు వచ్చింది మంత్రి వివరించాలని సూచించారు. దీనిపై రాష్ట్ర మంత్రి నారాయణ సమాధానం ఇస్తూ.. అక్టోబర్ 3న క్యాబినెట్లో ఈ అంశంపై చర్చించి 2027 నాటికి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తు సేవల పన్ను తగ్గింపు జిఎస్‌టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై నెల రోజుల సెలబ్రేషన్స్ కార్యక్రమం, సీజనల్ కండిషన్స్, పిఎం సూర్యఘర్, కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు, సోలార్, విండ్ ప్రాజెక్టులకు భూ సంబంధిత అంశాలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్టే ఈనెల 22 నుండి అమలులోకి వచ్చిన జిఎస్‌టి 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు దసరా నుండి దీపావళి వరకు నెలరోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. జిఎస్‌టి 2.0 వల్ల రాష్ట్రానికి సుమారు రూ.8 వేల కోట్ల ఆదాయం తగ్గుతున్నప్పటికీ ప్రతి కుటుంబానికి 10 నుండి 15 శాతం సొమ్ము ఆదా అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్వాగతించడం జరిగిందన్నారు. జిఎస్‌టి తగ్గింపు వల్ల ఏవిధంగా లబ్ధి కలుగుతుందనే దానిపై ప్రజలను విస్తృతంగా తెలియజేసే వాటిలో భాగంగా అవగాహన కల్పించేందుకు నెలరోజుల కార్యక్రమాన్ని అక్టోబరు 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సిఎస్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాలు, మండల, అసెంబ్లీ నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సిఎస్ విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు జిఎస్‌టి ప్రచారానికి సంబంధించి నెలరోజుల కార్యక్రమ వివరాలను తెలియజేశారు. సమావేశంలో జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏలూరు డివిజన్ వాణిజ్య పన్నుల డిప్యూటీ కమిషనర్ కెపి శైలజశ్రీ, భీమవరం, తణుకు, పాలకొల్లు, తాడేపల్లిగూడెం సర్కిల్స్‌కు చెందిన జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్లు వి.కేదారేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి

వీరవాసరం : జాతీయ కవి, కళాప్రపూర్ణ, స్వాతంత్ర సమరయోధుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం 158వ జయంతి వీరవాసరం కళాపరిషత్, కాపు సర్వీస్ క్లబ్, కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుండా రామకృష్ణ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, బిజెపి నాయకులు పాకా సత్యనారాయణ చిలకమర్తి విగ్రహానికి పూలదండలు వేసి ఆయన కీర్తిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుగ్రహీత, తెలుగు పండితుడు పంపన సాయిబాబా, తెలుగు పండితుడు మంకు శ్రీను, విగ్రహదాత విశ్రాంతి గ్రంథాలయ అధ్యాపకుడు వలవల రామకృష్ణలను ఘనంగా సన్మానించారు. విగ్రహదాత చిలకమర్తి జయంతి సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. కాపు సర్వీస్ క్లబ్, వనిత క్లబ్ తరపున 100 దుప్పట్లు పంచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో వంగా నరసింహారావు, జవ్వాది దశరధి శ్రీనివాస్, యర్రంశెట్టి వెంకటరత్నం, కె.సూర్యనారాయణ, గోదాసి రాంబాబు, గ్రంధి రామానుజరావు, పాల ఆంజనేయులు, వనిత క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ బి.లక్ష్మి కళ్యాణి పాల్గొన్నారు.

తణుకు : భావ స్వేచ్ఛకు ప్రాధాన్యత ఇచ్చిన పాత్రికేయుడు, దేశభక్తుడు చిలకమర్తి అని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు అన్నారు. శుక్రవారం సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎం స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రాంగణంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ గుంటూరి వెంకటచంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగుతనం మూర్తీభవించిన మహాకవి చిలకమర్తి అని అన్నారు. అనంతరం నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌ను, విశ్రాంత ఎన్‌టిపిసి డిప్యూటీ మేనేజర్ మందరపుసాయిబాబను నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేలపాటి చంటి, గోటేటి మారుతీగోవిందరావు, వెంకటేశ్వరరావు, కామర్సు పార్థసారధి, బర్రె శ్రీనివాసు, కె.రాంబాబు, ఆలపాటి సుబ్బారావు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, మహ్మద్ వల్లి, బి.దుర్గాభాను, కామర్సు శ్యామల, కర్రి నాగమణి పాల్గొన్నారు.

రమ్యశ్రీకి నియామక పత్రం అందజేత

పెనుమంట్ర : ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సి ఫలితాల్లో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి మెరిట్ లిస్ట్‌లో సెకండ్ ప్లేస్ సాధించిన మండలంలోని మార్టేరుకు చెందిన వెలగల రమ్యశ్రీ అమరావతిలో గురువారం నియామక పత్రం అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అర్హత పొందిన అందరికీ ఆయా ప్రాంతాల్లోని కొందరు విద్యా శాఖ ప్రతినిధుల ద్వారా నియామక పత్రాలు ఇచ్చారని, తనకు ఆచంట నియోజకవర్గం ప్రతినిధి ఉషారాణి నియామక పత్రం ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. తనతో పాటు మండలం నుండి ఏడుగురు నియామక పత్రాలు పొందినట్లు తెలిపారు.

అయోధ్యలంక వైసిపి గ్రామ కమిటీ నియామకం

ఆచంట : వైసిపిని బలోపేతం చేసేందుకు మండలంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి అన్నారు. శుక్రవారం అయోధ్యలంక గ్రామంలో వైసిపి ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అయోధ్యలంక వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా మానుకొండ సత్యనారాయణను నియమించినట్లు మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి తెలిపారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఆదేశాల మేరకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి, వైసిపి సీనియర్ నాయకులు ముప్పాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంకు గతంలో 2011లో శిలాఫలకం ఏర్పాటు చేసి మాజీ మంత్రి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ హామీలో భాగంగా అయోధ్యలంకలో బ్రిడ్జి నిర్మించి, ప్రజల చిరకాల కోరిక నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, ముత్యాల నాగేశ్వరరావు, కోట గిరిధర్, బళ్లారి నాగేశ్వరరావు, దొమ్మేటి రాంబాబు, కంచుస్తంభం శ్రీను, గొల్లపల్లి బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందజేత

పాలకొల్లు : ప్రభుత్వ ఆర్‌టిసి బస్సులలో ప్రయాణికులకు స్వచ్ఛంద సంస్థలు వసతులు కల్పించడం హర్షణీయమని నరసాపురం ఆర్‌టిసి డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి అన్నారు. పాలకొల్లు చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నరసాపురం ఆర్‌టిసి డిపోలోని 80 బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ డిపో మేనేజర్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, ఛైర్మన్ డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబు, రోటరీ క్లబ్ పాలకొల్లు సన్ రైజ్ అధ్యక్షులు మాజేటి రాజా, నెలకుర్తి కృష్ణమోహన్, కెవిఎస్‌బి పవన్, పినిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

స్వాతికి సన్మానం

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎ.స్వాతికి డిఎస్‌సిలో పిఇటి పోస్టు సాధించినందుకు శుక్రవారం కాలేజీలో అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ స్వాతి నిబద్ధతతో పనిచేసేదన్నారు. ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్ది దక్షిణ భారత పోటీలకు పంపినట్లు తెలిపారు. సభలో స్వాతిని ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరణ

కాళ్ల : అన్యాయానికి గురైన కార్యకర్తలకు వైసిపి డిజిటల్ బుక్ అండగా ఉంటుందని వైసిపి జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. పెదఅమిరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఉండి ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహారాజుతో కలిసి శుక్రవారం కార్యకర్తల కోసం 'డిజిటల్ బుక్' పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ఎక్కడ, ఎవరికి ఏ అన్యాయం జరిగినా ఈ డిజిటల్ బుక్‌లో నమోదు చేస్తామన్నారు.

పంట నమోదు 95 శాతం పూర్తి

మండల వ్యవసాయాధికారి దేవీ స్వరూప

పెనుమంట్ర : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ఉన్న వ్యవసాయ భూమి పంట నమోదు 95 శాతం పూర్తిచేయడం జరిగిందని ఆ శాఖ అధికారి బి.దేవీ స్వరూప శుక్రవారం ఇక్కడ తెలిపారు. రైతులందరూ ఇకెవైసి పూర్తిచేసుకోవాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయ యంత్ర పరికరాలకు సంబంధించి ఎఫ్ఎం సర్వే జరుగుతుందని, దీనిలో ఎవరెవరికి ఏయే యంత్ర పరికరాలు ఉన్నాయో రైతులందరూ రైతుసేవా కేంద్రాల వద్ద నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు.

ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనపై కఠిన చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

శానిటేషన్ టాస్క్‌ఫోర్స్ టీములతో శుక్రవారం పట్టణంలోని కిరాణ షాపులు, జ్యూస్ సెంటర్లు, హోటల్స్, స్వీట్ షాప్స్, బేకరి షాప్స్ మొదలగు షాపులపై మున్సిపల్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ప్రజారోగ్యం దృష్ట్యా ఆకస్మిక దాడులు జరిపి పర్యావరణానికి హాని కలిగించే నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువులను 10 కేజీల వరకు స్వాధీన పరచుకొని సదరు షాపుల వారికి రూ.3 వేల జరిమానా విధించినట్లు కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రెండో మెరిట్ జాబితా కోసం ఎదురు చూపులు..

0.5, 1 తేడాతో ఎంపిక కాని కానిస్టేబుల్ అభ్యర్థులు

ప్రజాశక్తి - ఆకివీడు

ఎపిఎస్‌ఎల్‌పిఆర్‌బి కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ రెండవ మెరిట్ జాబితా కోసం అధిక సంఖ్యలో అభ్యర్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో అర్హత సాధించి ఫైనల్ కట్ ఆఫ్ మార్కుల్లో అతి తక్కువ మార్జిన్‌తో అనేక మంది అభ్యర్థులు అవకాశాలను కోల్పోయారు. 0.5, 1, 2 మార్కుల వ్యత్యాసంతో ఈ అవకాశాలను కోల్పోయారు. అయితే పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన కొంతమంది అభ్యర్థులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉపాధ్యాయ పోస్టులకు సైతం ఎంపికయ్యారు. రెండు రకాల ఉద్యోగాలకు ఎంపికైన అనేకమంది ఉపాధ్యాయ వృత్తినే స్వీకరించారు. ఆ రకంగా అనేకమంది పోలీసు ఉద్యోగాలను వదిలి వేయడంతో ఆ పోస్టులు ప్రస్తుతం ఖాళీ అయ్యేట్లు లేక, ఇలా ఖాళీ అయిన పోస్టులను ప్రభుత్వం బ్యాక్‌లాగ్‌గా చూపించి తిరిగి పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతూ ఉంటుంది. అయితే ఆ రకంగా బ్యాక్‌లాగ్ జాబితాలో చేర్చకుండా ఖాళీ పోస్టులను అతి తక్కువ మార్జిన్ అవకాశంతో ఉద్యోగం కోల్పోయిన వారికి రెండవ జాబితా ద్వారా అవకాశం కల్పించాలని ఆ అవకాశం ఉన్నవారు కోరుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం రెండో జాబితా విడుదల చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు. అయితే గతంలో కూడా ప్రభుత్వం ఇదే తరహాలో రెండు, మూడు పరీక్షలకు హాజరై ఎంపికైన వారు ఖాళీ చేసిన(జాయిన్ కానీ) పోస్టుల కోసం రెండో జాబితా విడుదల చేసిన అవకాశాలు గతంలో జరిగాయని వారు అంటున్నారు. యుపిఎస్‌సి, సచివాలయం, డిఎస్‌సి నోటిఫికేషన్లు రావడం జరిగిందన్నారు. వాటిలో మూడు పరీక్షలకు ఎంపికైన వారి ద్వారా ఏర్పడిన ఖాళీలకు రెండో జాబితా విడుదల చేసిన విధానంలోనే ఇప్పుడు కూడా తమకు అవకాశం ఇవ్వాలని వారు అభ్యర్థిస్తున్నారు. ఈ పోలీస్ ఉద్యోగంపై మక్కువతో ఐదు సంవత్సరాల నుండి కష్టించి చదివామని, మరోసారి ఈ పరీక్షకు హాజరయ్యేందుకు తమకు వయస్సు అనుకూలించదని వారు వాపోతున్నారు. వయసు పరిమితి దాటిపోయాక ఉద్యోగావకాశం కోల్పోయే ప్రమాదం ఉందని, ఆ బారి నుండి తమను కాపాడాలని వారు కోరుతున్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఏసుబాబు

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తాడేపల్లిగూడెం

మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్లాస్టిక్ రహిత పట్టణముగా తాడేపల్లిగూడెంను తీర్చిదిద్దుదామని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో ఎన్విరాన్మెంట్ రంగోలి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని, తడి చెత్తను ఆర్గానిక్ ఎరువగా ఇంటి వద్ద తయారు చేసుకుని పండ్లు, ఆకుకూరలు, కూరగాయల మొక్కలను పండించుకోవచ్చని, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకునే వీలు కలుగుతుందని కమిషనర్ తెలియజేశారు. కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఎన్.రాజు, మున్సిపల్ ఇంజనీర్ వైవి.రమణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి.సీతారాం, శానిటేషన్ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, ఆఫీస్ సిబ్బంది, జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, మెప్మా టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ గుండుమోగులు పద్మప్రియ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పి-4పై సచివాలయ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - ఆచంట

ఈనెల 30వ తేదీ లోపు పి-4 సర్వే పూర్తి చేయాలని ఎంపిడిఒ బివిఎస్.కృష్ణమోహన్ అన్నారు. శుక్రవారం ఆచంట ఎంపిడిఒ కార్యాలయంలో పి-4పై సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన యాప్ డౌన్లోడ్ చేసుకుని వారికి మ్యాప్ అయిన బంగారు కుటుంబాలను కలిసి గతంలో నిర్వహించిన నీడ్ అసెస్మెంట్ సర్వేలో తెలిపిన అవసరాలు మార్గదర్శి ద్వారా సమకూరింది, లేనిది యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 30 లోపు పూర్తి చేయాలని, అన్ని శాఖల సచివాలయం సిబ్బంది పాల్గొనాలని తెలిపారు. ఈ సందర్భంగా బంగారు కుటుంబాల అర్హతలు, మార్గదర్శి బాధ్యతలు సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఒ పూర్ణ బాబ్జీ, ఇఒ ఆర్‌డి సూరన్న, యంగ్ ప్రొఫెషనల్ శ్రీధర్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో పి-4 మరింత ప్రభావంగా అమలు జరపడానికి పంచాయతీ కార్యదర్శులు కృషిచేయాలని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మీ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండలంలో ఉన్న కార్యదర్శులకు, అధికారులకు బంగారు కుటుంబాలకు మార్గదర్శకాలను మ్యాప్ చేయడానికి వీలుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వం పేదరికం లేని సమాజం కోసం కృషిలో భాగంగా బంగారు కుటుంబాలకు మార్గదర్శకలను మ్యాప్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఒటిఎస్‌గా సరిపల్లి కార్యదర్శి డి.రామాంజనేయులు, పిప్పర డిజిటల్ అసిస్టెంట్ రవితేజ ఆధ్వర్యాన శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ పి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఎంఎస్ఐ-ఐటిఇ 25 అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

తాడేపల్లిగూడెం : సోషియల్ అండ్ సస్టైనబుల్ ఇన్నోవేషన్స్ ఇన్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్(ఎస్ఎంఎస్ఐ-ఐటిఇ 25) 2వ అంతర్జాతీయ సదస్సు శుక్రవారం శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఎదుర్కొంటున్న పర్యావరణ, సామాజిక సమస్యలకు సుస్థిర సాంకేతిక పరిజ్ఞానాలు, పరిశోధనా ఆవిష్కరణలు కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సైట్, హెల్ప్ యూనివర్సిటీ(మలేషియా)ల మధ్య అకాడమిక్ కలయిక, పరిశోధనా సహకారం, అధ్యాపకులు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల కోసం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సదస్సులో పాల్గొన్న అంతర్జాతీయ, జాతీయ అతిథులు ప్రొ. డాక్టర్ మొహమ్మద్ మామున్ బిన్ రియాజ్, యూనివర్సిటీ కేబన్సాన్, మలేషియా, డాక్టర్ హుస్సేన్ షరీఫ్ యునైటెడ్ అరబ్ యమరైట్స్ యూనివర్సిటీ, ప్రొ. సెల్లప్పన్ పలనియప్పన్ హెల్ప్ యూనివర్సిటీ మలేషియా, డాక్టర్ ఘస్సన్ సలెహ్ హుస్సేన్ అల్ దబ్బాని, యూసి ఎస్‌టి యూనివర్సిటీ మలేషియా, ప్రొ.వజీర్ మహమ్మద్ ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం ప్రొ. డాక్టర్ సచినందన్ మొబాంటీ, విట్, అమరావతి డాక్టర్ వినయ్ రాజ్, నిట్, త్రిచీ రెండు రోజుల పాటు కొనసాగే ఈ సదస్సులో ప్రముఖ వక్తల ప్రసంగాలు, సాంకేతిక సెషన్లు, పరిశోధన పత్రాల సమర్పణలు జరుగనున్నాయని తెలిపారు. ఈ సదస్సులో సమర్పించిన పత్రాలు స్ప్రింగర్ నేచర్ పబ్లికేషన్ భాగస్వామ్యంతో ప్రచురించబడతాయని కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ ఇస్మాయిల్ తెలియజేశారు.

రైతులకు రుణాల అందజేతకు కృషి

సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారక రామారావు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు సొసైటీ ద్వారా రైతులకు రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఛైర్మన్ నిప్పులేటి తారక రామారావు అన్నారు. సొసైటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన అధ్యక్షత వహించి జరిగిన మహాసభలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఇటీవల జరిగిన 51 ఎంక్వైరీ నివేదిక ప్రకారం బాధ్యుల నుండి రూ.3.50 కోట్లు వసూలు చేసేందుకు తీర్మానించారు. గత ఆరు నెలల కాలంలో సొసైటీ నుండి ఇచ్చిన రుణాలు, సొసైటీకి రుణ బకాయిలు చెల్లించి బయటికి వెళ్లిన రైతుల వివరాలు తదితర వాటిని సమావేశంలో చదివి వినిపించి ఆమోదించారు. ఇప్పటి వరకు 15 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు వేయించామన్నారు. రైతులకు 35 లక్షల రుణాలు అందించామని తెలిపారు. సొసైటీ అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని ఛైర్మన్ తారక రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ కొత్తపల్లి గోవిందరాజులు, పర్సన్స్ కౌరు నాగేశ్వరరావు, మైలాబత్తుల రాంబాబు, పువ్వాడ శేషగిరి, గట్టం శ్రీను, మేకల పరశురాం, గుబ్బల నాగరాజు, మామిడిశెట్టి సత్యనారాయణ, గుండు రాజా, ముక్కు పుల్లయ్య, లోకం కృష్ణమూర్తి, భవనం నరసింహారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఛైర్మన్ తారక రామారావు

పాలమూరు సొసైటీ ప్రగతికి కృషి

ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి

ఛైర్మన్లను సత్కరిస్తున్న గన్ని, చాగంటి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పాలమూరు సొసైటీ ప్రగతికి కృషిచేయాలని, అందుకు ప్రభుత్వం నుండి సంపూర్ణ సహకారం అందుతుందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలం నుండి సొసైటీ ఛైర్మన్‌లుగా పదవులు చేపట్టిన పలువురికి వారు మీటింగ్ హాల్లో అభినందన సత్కారం చేశారు. ఈమేరకు మండలంలోని పాలమూరు సొసైటీ ఛైర్మన్ కండిబోయిన శ్రీనివాస్, సత్యవరం సొసైటీ ఛైర్మన్ మైగాపుల రాము తదితరులను సత్కరించి, సొసైటీల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

వనితా క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం

ఒఎన్‌జిసి క్లబ్‌లో యునైటెడ్ కాపు వనితాక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు, యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ మహిళా డైరెక్టర్ డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహన్‌రావు, అధ్యక్షురాలిగా బండి స్వర్ణలత, కార్యదర్శిగా రంగినీడి భరణి, కోశాధికారిగా సలాది మణికర్ణికచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నూతన టీమ్ వనితాక్లబ్ సేవలను మరింత విస్తృతపరచాలని కోరారు. మహిళలకు సంబంధించిన మెడికల్ క్యాంప్స్ ని నిర్వహించాలని కోరారు. డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ నూతన టీమ్‌కు శుభాకాంక్షలు అందజేసి భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పుప్పాల ఉషాకమల, జాయింట్ సెక్రటరీ తోట భారతి, సభ్యులు గంటా వెంకటరమణ, సుంకర రాజకుమారి, నాగమణి, తోట చంటి, దేవి, పూజిత, కుసుమ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

ప్రభుత్వ భూముల్లోని కొబ్బరి చెట్లు పేదలకు పంచాలి

వ్యకాస జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి

అభివాదం చేస్తున్న నేతలు

పెనుగొండ : ప్రభుత్వ పోరంబోకు, మురుగు, పంట కాల్వల గట్ల వెంబడి ఉన్న కొబ్బరి చెట్లు ఫల సాయం పేదలకు స్వాధీనం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జ్ అన్నారు. శుక్రవారం పెనుగొండ గ్రామపంచాయతీ వద్ద షేక్ పాదుషా అధ్యక్షతన జరిగిన మహాసభలో మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులైన నిరుపేదలు 360 రోజులు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి జీవనోపాధి కోసం ప్రభుత్వ భూముల్లో ఉన్న కొబ్బరి చెట్లను వారికి స్వాధీనం చేయడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది గ్రామ పెద్దల స్వాధీనంలో కొబ్బరి ఫల సాయాన్ని ఏళ్ల తరబడి అనుభవిస్తున్నారని చెప్పారు. అలాగే ప్రభుత్వ బంజరు భూములు, అసలు మినహా భూమి పేదలకు పంపిణీ చేయడం ద్వారా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. ఉపాధి పనుల్లో కార్మికులకు 200 రోజులు పనులు చెప్పాలని, రూ.600 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి చట్టాన్ని నీరుగారుస్తూ పేదలకు పనులు చూపించడంలో నిర్లక్ష్యంగా ఉన్నాయన్నారు. మహాసభలో మండల కార్యదర్శి షేక్ పాదుషా గత మూడు సంవత్సరాల కార్యక్రమాల నివేదిక ప్రవేశపెట్టారు. సభ్యులు చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పూతినీడి పద్మ, ఉపాధ్యక్షులుగా మామిడిశెట్టి ఏడుకొండలు, కార్యదర్శిగా కుడుపూడి ప్రసాద్, సహాయ కార్యదర్శిగా షేక్ పాదుషా, కమిటీ సభ్యులుగా కెవివి.సత్యనారాయణ, కె.నరసింహమూర్తి, కె.నారాయణ ఏడుగురితో మండల కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మహిళా సంఘం నాయకులు జక్కం శెట్టి వెంకటలక్ష్మి, మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు పాల్గొన్నారు.

'మహిళల ఆరోగ్య భద్రతే కూటమి ధ్యేయం'

ప్రజాశక్తి - వీరవాసరం

మహిళల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా టిడిపి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. వీరవాసరం మండలం కొనితివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి బీశెట్టి లక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మహిళలు కేన్సర్, బిపి, మధుమేహం, గుండె సంబంధిత రుగ్మతలు పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేల్లో తేలిందన్నారు. దీంతో ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండవ తేదీ వరకు దేశవ్యాప్తంగా స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ పేరుతో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారన్నారు. ప్రజలంతా ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్రీయ పోషణ్ మాసోత్సవంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన పోషకాహార ప్రదర్శనను ఆయన తిలకించారు. కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని గీతాబాయి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ యరకరాజు హరిహర రాజు, మాజీ సర్పంచి యరకరాజు సుబ్రహ్మణ్యం రాజు, మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్, మండల బిజెపి అధ్యక్షుడు వేండ్ర దివాకర్, జిల్లా నాయకుడు కురెళ్ల నరసింహారావు, వైద్యులు పద్మావతి, నవనీత్, ఆరోగ్య అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : మహిళల ఆరోగ్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 'స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద కాపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిపి కటారి జయలక్ష్మి పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో నిర్వహించే ఈ వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ కెఎల్.మాధవి మాట్లాడుతూ గర్భాశయ కేన్సర్‌ను ముందుగా గుర్తించడం ద్వారా జీవిత కాలాన్ని పొడిగించవచ్చని, గర్భాశయ కేన్సర్ సోకకుండా వ్యాక్సినేషన్ వేయించుకోవాలని కోరారు. మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన అప్పారావు పేట, 29న చినకాపవరం, అక్టోబర్ ఒకటో తేదీన చెరుకుమిల్లి గ్రామాలలో శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మాట్లాడారు. వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

గణపవరం : మహిళలకు వ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలని గణపవరం సర్పంచి మూరా అలంకారం అన్నారు. శుక్రవారం గణపవరం మూడవ సచివాలయం వద్ద స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మూరా అలంకారం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వైద్యశిబిరాల్లో మహిళలు వైద్యపరీక్షలు చేయించుకోవాలని అన్నారు. వ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డాక్టర్ ఓంకార్‌నాద్ మాట్లాడుతూ వచ్చేనెల రెండవ తేదీ వరకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులందజేస్తామని చెప్పారు. శిబిరంలో 238 మందికి వైద్యపరీక్షలు చేసి మందులందజేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, కూటమి నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నా క్లయింట్ అయిన **సానబోయిన శశికిరణ్** తండ్రి రామారావు,24-30, చిట్టూరి వారి వీధి, చేరుకువాడ,పెనుగొండ, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్-534320, వీరికి చెందిన ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ రిజిస్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్ డాక్యుమెంట్ నెం.1314/2003 తేదీ 24-06-2003 S.R.O పెనుగొండ ఆర్ఎస్ నెం 125/4 extent 170 చదరపు గజములు పెనుగొండ మండలం చెరుకువాడ గ్రామంలో ఉంది. సదరు ఒరిజినల్ లింకు దస్తావేజులను ది. 09-09-2025 తేదీన పెనుగొండ నుండి పాలకొల్లు బస్సులో వెళుతుండగా పడిపోయినది మరల వెళ్లి అంతయు వెతికిన దొరకలేదు ఎవరికైనా దొరికిన యెడల మాకు అందజేయగలరు

బండి లీలా ఫణి శ్రీరామ్
అడ్వకేట్-భీమవరం సెల్ :7893944559

స్వర్ణాంధ్రలో ఎన్‌సిసి ఎన్‌రోల్మెంట్

నరసాపురం : స్థానిక స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో 7(ఎ) నావెల్ యూనిట్ వారి ఎన్‌సిసి ఎన్‌రోల్మెంట్ 2025 సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. లెఫ్టినెంట్ కమాండర్ చిట్టి రోహిత్ కుమార్(సిఒ) అధ్యక్షతన విద్యార్థులకు శరీర దారుఢ్య పరీక్షలు, రాత పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు ముఖాముఖి ద్వారా నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా 18 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని లెఫ్టినెంట్ కమాండర్ చిట్టి రోహిత్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లెఫ్టినెంట్ సంజిత్ రౌత్రాయ్, కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కె.వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, కళాశాల కేర్ టేకర్ ఆఫీసర్ ఇస్తా మాణిక్యాలరావు, 7(ఎ) నావెల్ యూనిట్ పిఐ స్టాఫ్ పాల్గొన్నారు.

భూమిపై స్వర్గం కేరళ మ్యాగజైన్ కొనుగోలు

గణపవరం : మంచి చెడు పుస్తక ప్రచురణ సంస్థ 45 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ భూమిపై స్వర్గం కేరళ అనే ప్రత్యేక సంచిక తీసుకొచ్చినట్లు సంస్థ ఎడిటర్ పి.గోవింద్ శుక్రవారం చెప్పారు. పిప్పరకు చెందిన గోవింద్ మాట్లాడుతూ మొదటి కాపీని పుస్తక ప్రియుడు, మాజీమంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు రూ.4 వేలుకి కొనుగోలు చేసినట్లు చెప్పారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం

పాలకొల్లు : పాలకొల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా మజ్జి వీర వెంకట సత్య వరప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా వీర జయ రామాంజనేయులు, జనరల్ సెక్రటరీగా చక్రవర్తి గణేష్, జాయింట్ సెక్రెటరీగా ప్రసన్నకుమార్, లైబ్రరీ సెక్రటరీగా పామర్తి నగేష్, ట్రెజరర్‌గా బొడ్డుపల్లి శ్రీనివాసరావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కత్తుల సత్యనారాయణ ఎన్నికయ్యారు. లేడీ రిప్రజెంటేటివ్‌గా నాగ దుర్గావతి, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్‌గా వర్ధనపు దివాకర్, మురార్జీ రాజు, కొండేటి శ్రీనివాస్, కొప్పు కిషోర్, కోటే ఆశాజ్యోతి ఎన్నికయ్యారు. పాలకొల్లు బార్ అసోసియేషన్ ఎన్నికలలో మొదట పోటీ పడిన తరువాత ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికల వివరాలు ఎన్నికల అధికారి రాపాక ప్రభాకర్, సహాయ ఎన్నికల అధికారి భావన సునీల్ తెలియజేశారు.

'జగన్‌పై బాలకృష్ణ విమర్శలు తగవు'

పెనుమంట్ర : అసెంబ్లీలో మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి సైకో గాడంటూ ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ అనడం అతనిలోని సైకో లక్షణాలకు నిదర్శనమని వైసిపి రాష్ట్ర మహిళా నాయకురాలు, స్థానిక జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి ఇక్కడ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఈమేరకు ఒక ప్రకటన చేశారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక మానసిక రోగిగా సర్టిఫికెట్ పొందిన బాలకృష్ణ చట్టసభ సాక్షిగా తాను యావత్ ప్రపంచానికి ఒక నిజమైన మానసిక రోగిగా నిరూపించుకున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తుల నుండి శాసనసభ గౌరవాన్ని, శాసనసభ్యుల విలువలను కాపాడాలని కోరారు.

అన్న సమారాధనలో యాత్రికులు

మొగల్తూరు: పేరుపాలెం నార్త్ పంచాయతీ చాకలవారి పేటలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భారీ అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీమహాలక్ష్మి దేవి అలంకరణ చేశారు. అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

ప్రకటన

నా క్లయింటు పెనుగొండ గ్రామ కాపురస్తురాలు వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్ గారి భార్య: జలదాని శివ పార్వతి నాకు యిచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ ది. 26-08-2023 సం॥ తేదిన పెనుగొండ వాస్తవ్యులు అయిన వడుగు పెదబాలయోగి గారి కుమారుడు వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్ తో వివాహము శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, అన్నవరప్పాడు గ్రామంలో జరిగింది.

నా క్లయింట్ యొక్క ఆధార్ కార్డు లో ఆమె పుట్టింటి వారి ఇంటిపేరుతో జలదాని శివ పార్వతి పేరుతో వున్న ఆధార్ కార్డు తన అత్తింటి వారి పేరు తో మార్పు చేసుకొనుటకు అనగా వడుగు శివ పార్వతి W/o. వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్ గా మార్పు చేసుకొనుటకు దాఖలు చేసుకొనుటకు అవసరమై ఈ పేపరు ప్రకటన ఇవ్వడమైనది.

కావున ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియచేయునది ఏమనగా నా క్లయింట్ పేరు **వడుగు శివ పార్వతి** W/o. వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్ అని తెలియచేయడమైనది. కాబట్టి ఎవరికి అయినా అభ్యంతరములు ఉన్నా 7 రోజులలో తెలియ పర్చవలెను.

నా క్లయింట్ అడ్రస్సు:
వడుగు శివ పార్వతి
W/o. వడుగు సూర్య వెంకట సత్య దుర్గా ప్రసాద్,
డోర్ నెం. 14-75/6, JVI. నగర్, పెనుగొండ, ప॥గో॥జిల్లా.
Cell: 93903 89129

కంచెర్ల సురేష్‌బాబు
అడ్వకేట్, గూడెం రోడ్
సెల్: 94401 11308

మార్టేరు
ది.26-09-2025

మహారాజశ్రీ మొదటి అధనపు జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు. ఏలూరు జిల్లా

FDIA No. 45/2024 in O.S.No. 145/2020

బిట్వీన్:
వన్నెకూటి లక్ష్మి ప్రసన్న ...Petitioner/Plaintiff
Vs
పరిసే మాధవి మరియు 3 వగైర
...Respondents/Defendants

R1. పరిసే మాధవి,
W/o. Late. చిన్న ఆంతోని, R/o. H.No: 9-129, వట్లూరు విలేజ్, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.
R2. పరిసే సన్నీ,
S/o. Late. చిన్న ఆంతోని, R/o. H.No: 9-129, వట్లూరు విలేజ్, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.
R3. పరిసే రత్నకుమార్,
S/o. Late. చిన్న ఆంతోని, R/o. H.No: 9-129, వట్లూరు గ్రామము, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.
R4. పరిసే షేని,
D/o. Late. చిన్న ఆంతోని, R/o. H.No: 9-129, వట్లూరు గ్రామము, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా.
4th Respondent, Being Minor Rep by its Natural Guardion: Mother ie 1st Respondent here in

కోర్టు ప్రకటన

పై నెంబరు దావాలోని వాది పెలిమినరి డిక్రీ పొందియున్నాడు. అందునిమిత్తం వాది ఫైనల్ డిక్రీ పిటీషన్ ఫైల్ చేసియున్నారు. పై నెంబరు FDIA 45/2024 లో Respondents ఎన్ని సార్లు కోర్టు మీకు నోటీసులు పంపినను నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసులు అమలు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసినారు. పై నెంబరు FDIA లో ప్రతివాదులకు నెం. 1 to 4 ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల **ది. 14-10-2025 వ తేదీ ఉదయం గం. 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఆక్షేపణలు తెలియజేసుకోనవలెను. లేనియెడల మీకు పరోక్షముగా అర్డరు పాస్ చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడం అయినది.

K.R.K. Chowdary
Advocate
Eluru
Eluru
Date: 26-09-2025